సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 4 । మే । 2024



వైఎస్సార్‌సీపీలో చేరిక

అన్నమయ్య జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో తెలుగుదేశం పార్టీకి గుడ్‌బై చెప్పి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు.

-10లో



సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

షేర్ మార్కెట్లో పెట్టుబడులతో నష్టాలు, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు.

- 10లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.134	రూ.180
రెండోరకం	రూ.90	రూ.130

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 326 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	220	460
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 448.780 కిలోలు

ఇవేం కష్టాలు బాబూ..!



- పింఛన్ కోసం పండుటాకుల పాట్లు
- 2267 మందికి బ్యాంకుల్లో జమ కాని వైనం
- మరో 2228 మందికి డోర్ డెలివరీ ద్వారా అందని డబ్బులు
- బాబు కుట్రతో నాలుగో రోజూ బ్యాంకుల వద్ద వృద్ధుల పడిగాపులు

రాయచోటి: వృద్ధులు, దివ్యాంగులు పింఛన్ డబ్బుల కోసం పడుతున్న కష్టాలు వారి చావుకు వచ్చినట్లు ఉన్నాయి. మే నెల ప్రారంభమై నాలుగు రోజులు గడిచినా ఇంతవరకు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు రాకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మండుటెండలలో మలమల మాడుతూ అందుబాటులో ఉన్న కుటుంసభ్యులను వెంట తీసుకుని పింఛన్ కోసం బ్యాంకుల వద్దకు వెళ్లేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. నెల వచ్చిందంటే జగనన్న ప్రభుత్వం వలంటీర్ల ద్వారా అందుకున్న పింఛన్ డబ్బులను చేత పట్టుకుని ఇంటి సరుకులు, ఆరోగ్య అవసరాలకు ఖర్చు చేసుకునేవారు. గత మంగళవారం అందాల్సిన పింఛన్ డబ్బులు నేటికీ చేతికి రాకపోవడంతో శుక్రవారం కూడా పింఛన్ డబ్బుల కోసం బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గంటల కొద్దీ బ్యాంకుల వద్ద ఉంటే తప్ప పింఛన్ డబ్బులు ఇవ్వడం లేదు. శుక్రవారం పట్టణంలోని అన్ని బ్యాంకుల దగ్గర ఇదే పరిస్థితి నెలకొంది. పింఛన్ తీసుకోవడం కోసం ఒకరు వస్తే ఆ వ్యక్తితో పాటు మరొకరు పనిమానుకొని రావాల్సిన పరిస్థితి. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో బ్యాంకుల వద్ద ఉన్న చెట్ల కింద గంటల కొద్దీ నిరీక్షిస్తూ ఇబ్బందులు పడ్డారు. దీనికితోడు రానుపోను ఆటోల కోసం వందల రూపాయలు చెల్లించాల్సి వస్తోందని పింఛన్‌దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి బ్యాంకు వద్దకు చేరుకున్న లబ్ధిదారులు మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండాల్సి వస్తుంది. బ్యాంకు ద్వారా ఇస్తున్న డబ్బులు ఉదయం ఇచ్చే ఏర్పాటు చేస్తే బాగుంటుందని పింఛన్‌దారుడు శివరామయ్య అభిప్రాయపడుతున్నారు.



నందలూరులోని ఓ బ్యాంకులో పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు

బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది..

అన్నమయ్య జిల్లా పరిధిలో 2,24,504 మందికి 62 కోట్ల 62 లక్షల 62 వేల రూపాయలు ప్రభుత్వం మంజూరు చేసింది. వీరిలో 1,64,846 మందికి నేరుగా ప్రభుత్వం వారి ఖాతాల్లో రూ.49,45,38,000 పింఛన్ డబ్బులను జమ చేయాల్సి ఉంది. బ్యాంకు ఖాతాలలో సాంకేతిక సమస్య కారణంగా 2267 మందికి అందలేదు. మూడు రోజుల పాటు వీరు బ్యాంకుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది.

డోర్ డెలివరీకి నోచుకోని 2228 మంది

సచివాలయ సిబ్బందికి పింఛన్ల పంపిణీలో తగిన అనుభవం లేకనో మరేదో కారణం తెలియదు కానీ బ్యాంకు ఖాతాలు లేని వారికి నేరుగా డబ్బులు అందించేందుకు సచివాలయ సిబ్బంది ప్రయత్నించినా ఇంకా 2228 మందికి రూ.68 లక్షల పింఛన్ డబ్బులు అందలేదు. బ్యాంకుల ద్వారా కాకుండా అకౌంటు లేని 59658 మందికి 17.17 కోట్ల రూపాయలను నాలుగు రోజులుగా అందిస్తున్నారు. వీరిలో 2228 మంది ఇళ్ల దగ్గర లేకనో సచివాలయ సిబ్బందికి పింఛన్‌దారుల పట్ల అవగాహన లేకనో తెలియదు కానీ శుక్రవారం సాయంత్రం వరకు వారికి కూడా రూ.63.3 లక్షల డబ్బులు చేరలేదని అధికారుల నివేదికలు చెబుతున్నాయి. బ్యాంకుల్లో జమ అయిన డబ్బుల కోసం వృద్ధులు, దివ్యాంగులు బ్యాంకుల వద్ద అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు వృద్ధులు సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి అందిస్తారని గడప పాటునే కూర్చొని దారి వైపు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. చంద్రబాబునాయుడు, నిమ్మగడ్డ రమేష్ చేసిన పాపాలకు చివరి మజిలీలో వృద్ధులు కన్నీటి రోదనతో విలపిస్తున్నారు.

మూడు రోజులు.. 15 కిలో మీటర్లు..



పింఛన్ కోసం నిరీక్షిస్తున్న మౌలాఖాన్

కలకడ: ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ తీసుకోవడం కోసం మూడు రోజులుగా 15 కిలోమీటర్లు తిరుగుతూనే ఉన్నట్లు మండలంలోని కోన పంచాయతీ బంగారు వాండ్లపల్లె గ్రామానికి చెందిన పఠాన్ మౌలాఖాన్ (86) తెలిపారు. వీరి గ్రామానికి 15 కిలోమీటర్ల దూరంలోని కలకడ గ్రామీణ బ్యాంకులో నగదు జమ చేసినట్లు తెలుసుకుని కాళ్లరిగేలా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నాడు. మూడో రోజు వచ్చి బ్యాంకు ఖాతాలో పరిశీలించగా తాను బ్యాంకు ఖాతాలో నగదు వేయడం కానీ, తీయడం కానీ చేయలేదని పింఛన్ డబ్బు తీసుకోవడానికి అవకాశం లేదని బ్యాంకర్లు చెప్పారు. బ్యాంకు నిబంధనలు ఏమాత్రం తెలియని ఇతను ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇతరుల సాయంతో బ్యాంకు ఖాతా నంబరుకు ఆధార్ నంబరు అనుసంధానం చేసుకునేందుకు తిప్పలు పడ్డాడు. వలంటీర్ వద్దకు, సచివాలయం వద్దకు, తపాలాశాఖ వద్దకు తిరిగి చివరకు ఇలా బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్నాడు.

ఈ వయస్సులో ఈ కర్మ ఏంది సామీ



నాపేరు నరసమ్మ. మాది రాజంపేట మండలం కొల్లావారిపల్లె. జగన్ పుణ్యమా అని కాలు కదపకుండా వలంటీర్లు ఇంటికాడికే వచ్చి పింఛన్ ఇచ్చిపోయేవాళ్లు. ఇప్పుడు ఈ నెలలో నా పింఛన్ దుడ్డు బ్యాంకులో ఏసినారంటే ఆటో మాట్లాడుకొని కెనరా బ్యాంకుకాడికి వచ్చినా. ఈడేమో నా దుడ్డు పడలేదని సెపుతున్నారు. తిరగలేక సస్తున్నా. ఈ వయస్సులో నాకు ఈ కర్మ ఏంది సామీ..

సమాధానం చెప్పేవారే లేరు!



నా భర్త మునిస్వామికి ప్రతి నెలా గ్రామ వలంటీరు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ అందించేవారు. ఈనెల పింఛన్ పొందాలంటే బ్యాంకుల్లో వేశామని చెప్పారు. నా భర్తకు బ్యాంకులో అకౌంట్ లేదు. రెండు రోజులుగా గ్రామ సచివాలయం వద్దకు, పోస్టాఫీసు వద్దకు, బ్యాంకు వద్దకు తిరుగుతున్నా. ఎవరూ సరైన సమాధానం చెప్పడం లేదు.పింఛన్ వస్తుందో రాదో.

– రంగమ్మ, కేవీపల్లె

ఈ అవస్థలు పడలేకున్నాం



గత మూడు రోజులుగా పింఛన్ కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నాం. నా ఖాతా నంబరు స్తంభించినట్లు చెప్పారు. అసలు అకౌంట్‌లో పింఛన్ డబ్బులు పడినాయోలేదో తెలీదు. గతంలో వలంటీరు ఇంటికే తెచ్చి పింఛన్ అందించేవారు. అప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాలేదు. చంద్రబాబు మామీద ఎందుకు కక్ష పెంచుకున్నాడో అర్థం కాలేదు.

– యశోదమ్మ, పీలేరు

ఈ తిప్పలు ఎందుకు పెడుతున్నారో..



మూడు రోజులుగా పింఛన్ కోసం బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా. నాకు బ్యాంకు ఖాతా సరి చేయడానికి తిప్పించుకుంటున్నారు. డబ్బులు పడాలంటే ధ్రువపత్రాలు తెచ్చి ఇవ్వమంటున్నారు. పింఛన్ డబ్బులతో కాలం వెళ్లదీసే మాకు ఈ తిప్పలు ఎందుకు పెడుతున్నారో తెలీదు. మళ్లీ జగన్‌బాబు వస్తేనే మాకు బాధలు తప్పుతాయి.

– రాజమ్మ, పీలేరు

ప్రారంభమైన ఓట్ ఫ్రం హోమ్



పీలేరు నియోజకవర్గంలో హోం ఓటింగ్ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న వృద్ధురాలు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో హోం ఓటింగ్ ప్రక్రియ షురూ అయింది. శుక్రవారం పలువురు వృద్ధులు ఇంటి వద్ద నుంచి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హోం ఓటింగ్‌ను ఎంచుకున్న ఓటర్ల ఇంటి వద్దకే అధికారుల బృందం వెళ్లి బ్యాలెట్ పేపర్లను అందజేసింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 9782 మంది, వృద్ధులు, పీడబ్ల్యూడీలు 18153 మంది హోం ఓటింగ్ అర్హత కలిగి ఉన్నారని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ వెల్లడించారు. వీరిలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు 9782 మంది, 40 శాతం అంగవికలత్వం పైబడిన దివ్యాంగులు 18153 మంది ఉన్నట్లు ఆయన తెలిపారు. వీరిలో కేవలం 865 మంది మాత్రమే హోం ఓటింగ్ విధానాన్ని ఎంచుకున్నారన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రాయచోటి: ఈనెల 5, 6 తేదీలలో అన్నమయ్య జిల్లాలో నిర్వహించే పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం.అభిషిక్త్ కిషోర్ తెలిపారు. అన్నమయ్య జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలలో ఓటరుగా నమోదై ఎన్నికల విధులలో పాల్గొంటున్న ప్రిసైడింగ్ ఆఫీసర్లు తదితరులు ఈనెల 5న, ఇదే జిల్లాలో పని చేస్తూ ఈ జిల్లాలోనే ఓటరుగా నమోదై ఎన్నికల విధులలో పాల్గొంటున్న పోలీసులు, ఆర్టీసీ డ్రైవర్లు, క్లీనర్లు, బీఎల్‌ఓలు, సెక్టోరల్ అధికారులు తదితరులు ఈనెల 6న పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలన్నారు.కాగా జిల్లాలో 85 ఏళ్లు పైబడిన వృద్ధులకు, పీడబ్ల్యూడీ ఓటర్లకు ఈనెల 8వ తేదీ వరకు హోమ్ ఓటింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

న్యూస్‌రీల్

7న ఊటీకి సమ్మర్ స్పెషల్ బస్సు

మదనపల్లె సిటీ: వేసవి సెలవులను పురస్కరించుకుని ఈనెల 7న ప్రముఖ పర్యాటక కేంద్రమైన ఊటీకి సూపర్ లగ్జరి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. 7న రాత్రి మదనపల్లె డిపో నుంచి బయలుదేరి 8న ఉదయం ఊటీకి చేరుకుంటుందన్నారు. ఊటీ, కున్నూరు హిల్‌స్టేషన్, మైసూర్ చూసుకుని 10న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. రాను,పోను చార్జీ రూ.2800 చెల్లించాలన్నారు. ఫోన్ నంబర్లు 9346772487, 9441152934ను సంప్రదించాలని సూచించారు.

మద్యం షాపుల ఆకస్మిక తనిఖీ

కురబలకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అన్నమయ్య జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎం. వినయ్‌బాబు శుక్రవారం కడప క్రాస్, అంగళ్లు, ములకలచెరువు మండలంలోని పెద్దపాళ్యంలోని ప్రభుత్వ మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మద్యం స్టాకును, రికార్డులను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈ మద్యం దుకాణాలు సెన్సిటివ్ షాపుల కింద ఉండడంతో ఎన్నికల నేపథ్యంలో అవకతవకలకు పాల్పడకుండా ఆకస్మిక సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్లు నిబంధనలకు లోబడి మద్యం దుకాణాలు నిర్వహించాలన్నారు. అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మదనపల్లె ఎక్సైజ్ ఎస్‌ఐ జయనరసింహ పాల్గొన్నారు.

స్మార్ట్‌బైక్ రూపొందించిన విద్యార్థులు



బైక్‌తో డైరెక్టర్, అధ్యాపకులు, విద్యార్థులు

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు స్మార్ట్ బైక్ తయారుచేశారు. బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న బి.లేపాక్షి, పి.నాగేశ్వరరెడ్డి, సాయికుమార్‌రెడ్డి, ఎం.శ్రీకాంత్, రాఘవేంద్ర కలిసి ఈ బైక్ తయారు చేశారు. ప్రాజెక్టు గైడ్ ప్రవీణ సహాయ,సహకారాలు అందించారు.ఈ బైక్ తయారీలో గేరింగ్ సిస్టం, బ్లూటూత్ డిజిటల్ డిస్‌ప్లే, జీపీఎస్ ట్రాకర్, సోలార్ సిస్టంను ఉపయోగించారు. ఈ స్మార్ట్ బైక్‌ను ఒకసారి చార్జ్ చేస్తే 60 కిలోమీటర్ల నుంచి 80 కిలో మీటర్ల వరకు మైలేజీ వస్తుందని, చార్జింగ్‌కి 4 గంటల సమయం పడుతుందని విద్యార్థులు వివరించారు. కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, ప్రిన్సిపాల్ సతీష్‌బాబు, ఈఈఈ హెడ్ వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు తదితరులు శుక్రవారం ఈ బైక్‌ను ప్రదర్శించారు.

టీడీపీ చీప్ పాలిట్రిక్స్

- ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపు కోసం టీడీపీ కుయుక్తులు
- దుష్ప్రచారానికి తెరతీసిన వైనం
- అగ్రిమెంట్ పేపర్లపై సీఎం ఫొటో కనిపించేలా చేసి అసత్య ప్రచారం

సాక్షి రాయచోటి: సార్వత్రిక ఎన్నికల తరుణంలో టీడీపీ నేతలు ప్రజాభిమానం లేక ఓట్ల కోసం జిమ్మిక్కులకు తెరలేపుతున్నారు. ఏదో ఒక రకంగా ప్రజలను బురిడీ కొట్టించాలన్న ఆలోచనతో కొత్త రకం వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఎలాగోలా తిమ్మిని బమ్మిని చేసి నమ్మిస్తే ఓట్ల కాలం కాస్త గడిచిపోతుందని భావిస్తున్నారు. ఆది నుంచి కూడా తెలుగుదేశానికి ప్రజాక్షేత్రంలో అంతంత మాత్రమే బలమున్న తరుణంలో కుట్రలు, కుయుక్తులకు పదును పెడుతున్నారు. ప్రజాస్వామ్యంలో నిబద్ధతతో గెలవాలన్న సంకల్పానికి పాతర వేసి పైశాచిక వ్యవహారాలకు తెర తీస్తుండడం విస్మయానికి గురి చేస్తోంది.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం

అన్నమయ్య జిల్లాలో తెలుగు తమ్ముళ్లు సోషల్ మీడియాను వేదికగా చేసుకుని వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారానికి ఒడిగట్టారు. ప్రధానంగా ల్యాండ్ టైట్లింగ్ చట్టం సాకుగా చూపుతూ సోషల్ మీడియాలో గ్లోబల్ ప్రచారం చేస్తున్నారు. అగ్రిమెంటు పేపర్‌పై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో వేసుకున్నట్లు చూపుతూ షేర్ చేస్తున్నారు. ఏదో ఒక రకంగా ఓటర్లను భయపెట్టి...ఏమార్చి ఓటును టీడీపీకి వేసేలా కుట్రలు చేయడంపై ప్రజాస్వామ్య వాదులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా రాజంపేటతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో వాట్సాప్ గ్రూపులతోపాటు ఇతర సోషల్ మీడియాలోనూ జోరుగా ప్రచారం సాగిస్తున్నారు. అగ్రిమెంటు పేపర్‌తోపాటు మ్యాటర్‌ను జత చేసి దుష్ప్రచారం చేస్తుండటంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. అంతేకాకుండా వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల కమిషన్ దృష్టికి ఈ వ్యవహారం తీసుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.



సోషల్ మీడియాలో బాండు పేపర్‌పై సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఫొటో వేసి దుష్ప్రచారం చేస్తున్న దృశ్యం

ఆది నుంచి అంతే

అన్నమయ్య జిల్లాలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అన్నిచోట్ల బలంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఏదో ఒక రకంగా ఓటర్లను తమవైపు తిప్పుకోవాలన్న ఆలోచనతో టీడీపీ ఆది నుంచి ఏదో ఒక వ్యూహానికి తెర తీస్తోంది. ఒక్క ల్యాండ్ టైట్లింగ్ యాక్టే కాకుండా ఎన్నికల సమయం కావడంతో రకరకాల ప్రచారాలను తెరపైకి తెస్తూ ప్రజలను మభ్యపెట్టే చర్యలకు ఉపక్రమిస్తున్నారు. గతంలో రాయచోటి జిల్లా కేంద్రాన్ని మారుస్తున్నారని కూడా ఇదే తరహాలో గోబెల్స్ ప్రచారం నిర్వహించారు.

దుష్ప్రచారాన్ని నమ్మరాదు: తెలుగుదేశం పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మరాదని వైఎస్సార్‌సీపీ నేతలు ప్రజలకు పిలుపునిస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సమీపిస్తున్న తరుణంలో ఇలాంటి ప్రచారాలు మరిన్ని జరిగే అవకాశం ఉందని, వాటిని ప్రజలు విశ్వసించరాదని కోరుతున్నారు.

ప్రధాని బహిరంగ సభకు పటిష్ట బందోబస్తు

కలికిరి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 8న కలికిరికి రానున్న నేపథ్యంలో కర్నూలు రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావుతో కలిసి శుక్రవారం కలికిరిలో పర్యటించారు. ప్రధానమంత్రి పర్యటనకు ఎంపిక చేసిన హెలిప్యాడ్, అక్కడి నుంచి సభాస్థలం వరకు రోడ్డు మార్గం, బహిరంగ స్థలం ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ పీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని, బందోబస్తుకు హాజరయ్యే సిబ్బంది అన్ని వేళలా అప్రమత్తంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. హెలిప్యాడ్, సభా స్థలం ఎక్కడా కూడా అనధికారికంగా డ్రోన్‌లు ఎగురవేయ కూడదన్నారు. అలాగే ప్రధానమంత్రి హెలిప్యాడ్, రోడ్డుమార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వైద్య బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు తగినన్ని మందులు అందుబాటులో ఉండేటట్లు చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్, డీఎస్పీ మహబూబ్ బాషా, సీఐలు, ట్రాన్స్‌కో, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కలికిరిలో ప్రధానమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఐజీ సీహెచ్ విజయరావు

బాబుది బూటకపు మేనిఫెస్టో

- ప్రపంచ బ్యాంకు సైతం అమలు చేయలేదు
- జిల్లా కేంద్రాలపై బాబు ప్రకటనలు హాస్యాస్పదం
- అబద్ధపు హామీలివ్వడంలో బాబు దిట్ట
- వైఎస్ జగన్ చేసిన అభివృద్ధి అందరికీ తెలుసు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మదనపల్లె: ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ప్రకటించిన బూటకపు మేనిఫెస్టోను ప్రపంచ బ్యాంకు సైతం అమలు చేయలేదని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లె పర్యటనకు శుక్రవారం వచ్చిన ఆయన సాక్షితో మాట్లాడుతూ.. ఓటు అడిగే అర్హత చంద్రబాబుకు లేదన్నారు. 2014లో 100 పేజీల మేనిఫెస్టోలో 600 అబద్ధపు హామీలిచ్చి, ఏ ఒక్కటీ అమలుచేయలేదన్నారు. కేవలం క్యాపిటల్ చుట్టూ భూములను రియల్ ఎస్టేట్ చేసుకుని, లక్షల కోట్లు సంపాదించి, ఆ డబ్బులతో ఎన్నికల్లో ఖర్చుచేసి జగన్‌ను ఎదుర్కోవాలనే దురాలోచనతో ముందుకెళ్లారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల ప్రచారంలోనూ నారాలోకేష్.. అధికారంలోకి వచ్చిన వెంటనే యుద్ధప్రాతిపదికన క్యాపిటల్ భూములను అభివృద్ధి చేస్తామని చెబుతున్నారని, తండ్రీ, కొడుకులిద్దరికీ రాజధాని భూముల అభివృద్ధితో కోట్లు దోచేయడంపైనే ధ్యాస అధికమన్నారు. ప్రజాగళం ఎన్నికల ప్రచారంలో భాగంగా మదనపల్లెను జిల్లా కేంద్రం చేస్తామన్న చంద్రబాబు.. తిరిగి రాయచోటిలో జిల్లా కేంద్రంగా కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. పూర్తి నిరాశ, నిస్పృహలో కూరుకుపోయిన చంద్రబాబుకి ఏం మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదన్నారు. మేనిఫెస్టోలోని హామీలను 99శాతం అమలుచేసి, ప్రతి పేద కుటుంబానికి మేలుచేసి, ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ నాయకులు ఓట్లు అడిగే పరిస్థితి ఉంటే... జన్మభూమి కమిటీలు వేసుకుని, పచ్చచొక్కాలకే పథకాలు ఇచ్చే పరిస్థితి టీడీపీ పాలనదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతిదీ పారదర్శకంగా, అర్హతే ప్రామాణికంగా, కుల,మత, పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి చేశాం కనుకే ప్రజల్లోకి ధైర్యంగా వెళ్లి ఓటు అడుగుతున్నామన్నారు. 2019 నుంచి 2024 వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికీ తెలుసన్నారు. పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే క్యాపిటల్ భూముల అభివృద్ధి తప్ప ప్రజాసంక్షేమం, అభివృద్ధి గురించి పట్టించుకోరన్నారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, కొడుకు లోకేష్, బావమరిది బాలకృష్ణ, వదిన పురందేశ్వరి, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌లు పనిగట్టుకుని సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై, తనపై తిట్లపురాణం, గాలిమాటలు మాట్లాడటం చేస్తున్నారని, ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారని చెప్పారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో సరైన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, నాయకులు ఎస్.శ్రీనాథరెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్‌బాషా, మున్సిపల్ చైర్‌పర్సన్ జింకా వెంకటాచలపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

బెడిసికొట్టిన జడ్జి రామకృష్ణ దాడి నాటకం

- ఈ కేసులో నిందితుడైన జడ్జి తమ్ముడు రామచంద్ర అరెస్టు
- ప్రచారం కోసమే మంత్రి పెద్దిరెడ్డిపై ఆరోపణలు

సాక్షి ప్రతినిధి, కడప: అన్నమయ్యజిల్లా బి.కొత్తకోటకు చెందిన సస్పెన్షన్‌లో ఉన్న జూనియర్ సివిల్ జడ్జి ఎస్.రామకృష్ణ ఇంటిపై దాడి ఘటన ఓ నాటకంగా తేలిపోయింది. దాడిచేసి ఇంటి కిటికీ అద్దాలను పగులగొట్టింది స్వయానా జడ్జి తమ్ముడు రామచంద్ర అని విచారణలో నిర్ధారించిన పోలీసులు అతన్ని అరెస్ట్ చేయడంతో నాటకానికి తెరపడింది. సోదరుల మధ్య కుటుంబ ఆస్తి పంపకాల విషయంలో తలెత్తిన విభేదాలను కూడా మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి ఆపాదించే ప్రయత్నం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మదనపల్లెలో గురువారం మీడియా సమావేశంలో మంత్రి పెద్దిరెడ్డి కుటుంబంపై జడ్జి రామకృష్ణ చేసిన ఆరోపణలు నిరాధారమని అర్థమైంది. గతంలోనూ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబానికి సంబంధం లేని వివాదంలోకి లాగడం కూడా ఇలాంటిదేనని స్పష్టమైంది. రామకృష్ణ చేసిన ఫిర్యాదులో నిందితుడు అతని తమ్ముడేనని తేల్చి ఈ మేరకు అరెస్ట్ చేసి 41 నోటీసు జారీ చేశామని బి.కొత్తకోట సీఐ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. గత నెల 30న రాత్రి బి.కొత్తకోట కరెంట్ కాలనీలో ఉంటున్న రామకృష్ణ ఇంటివద్దకు వచ్చిన తమ్ముడు రామచంద్ర ఆస్తి పంపకాల గురించి ప్రశ్నించేందుకు ప్రయత్నించాడు, ఇంటిలో నుంచి రామకృష్ణ వెలుపలికి రాకపోవడంతో అక్కడే ఉన్న కట్టెను తీసుకుని గేటుకు కొట్టడంతో రామకృష్ణ బయటకు రాగా ఇద్దరి మధ్య ఆస్తి పంపకాలకు సంబంధించి వివాదం జరిగింది. ఈ సందర్భంగా చోటుచేసుకున్న గొడవతో రామచంద్ర కిటికీ అద్దాలను ధ్వంసం చేశాడు. ఈ ఘటనపై గుర్తు తెలియని వ్యక్తులు తనను హతమార్చేందుకు దాడిచేశారని ఈనెల ఒకటిన రామకృష్ణ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, పరిసరాల్లో జరిపిన విచారణలో రామచంద్రే ఇంటి కిటికీ అద్దాలను ధ్వంసం చేసినట్టు తేలింది. ఈ కేసులో నిందితుడైన రామచంద్రను అరెస్టు చేశామని సీఐ తెలిపారు. రామచంద్రపై బి.కొత్తకోట పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే ఏడు కేసులు నమోదైనట్టు ఆయన పేర్కొన్నారు.



పగిలిన జడ్జి రామకృష్ణ ఇంటి కిటికీ

జగన్ సంక్షేమ పథకాలతోనే పేదల జీవితాల్లో వెలుగులు

ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి/చిన్నమండెం: జగన్ సంక్షేమ పథకాలతోనే పేదల జీవితాల్లో వెలుగులు నిండాయని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. చిన్నమండెంలోని చాకిబండలో శుక్రవారం జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుటుంబ సభ్యులు కుంచంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, సాయిపీర్, వెంకట్రామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, షకీల్ తదితర నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో రాయచోటి ప్రాంతానికి చేసిన శాశ్వత అభివృద్ధి పథకం ఒక్కటైనా ఉందా అని ప్రశ్నించారు. అన్నమయ్య జిల్లాలో 6 నియోజకవర్గాలుంటే 3 జిల్లా కేంద్రాలు ఎలా చేస్తారని చంద్రబాబును ప్రశ్నించారు. ఎన్నికల హామీలను నెరవేర్చిన చరిత్ర జగన్‌దేనన్నారు. 15 ఏళ్లుగా రాయచోటికి కాపలాదారుడుగా ఉంటున్నా.. ఏ తప్పు చేయను.. చేయబోనని శ్రీకాంత్‌రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. భూఆక్రమణలు, అన్యాయాలు, రౌడీయిజాలు, దౌర్జన్యాలు ఎవరు చేస్తారో ప్రజలకు బాగా తెలుసన్నారు. ఒక్క రాయచోటి నియోజకవర్గానికే రూ.2300 కోట్ల నిధులు వివిధ సంక్షేమ పథకాల ద్వారా అందడం ఒక రికార్డుగా పేర్కొన్నారు. గండికోట నుంచి వెలిగల్లుకు నీళ్ల తీసుకొచ్చే రూ.2200 కోట్ల పథకం పనులు 70 శాతం మేర పూర్తయ్యాయన్నారు. ఇలా ఎన్నో అభివృద్ధి పనులను చేసి చూపించామన్నారు. కరోనా సమయంలో టీడీపీ నాయకులు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. తాము కరోనా సమయంలో ఆసుపత్రులకు వెళ్లి రోగులలో మనోధైర్యాన్ని కల్పించి తోడుగా నిలిచామన్నారు. తాను ఎమ్మెల్యేగా రాక ముందు రాయచోటి ఎలా ఉండేదని.. ఇప్పుడెలా ఉందో ప్రజలే బేరీజు వేసుకుని ఆలోచించుకోవాలన్నారు. ఈ ప్రాంత రూపురేఖలు మార్చడానికి మీ బిడ్డ అయిన తనను ఎమ్మెల్యేగా, పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ఎంపీగా ఆదరించి ఆశీర్వదించాలని ఆయన అభ్యర్థించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

క్లుప్తంగా

అక్రమ మద్యం నిల్వలపై కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయండి

రాయచోటి టౌన్ : ఎన్నికల వేళ అక్రమంగా మద్యం అమ్మినా, నిల్వలు ఉంచినా వెంటనే ఎక్సైజ్ శాఖ కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేయాలని అన్నమయ్య జిల్లా అబ్కారీ అధికారి మెరుగు వినియ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం నిల్వలు ఉంచినట్లు తెలిసిన వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని కోరారు. దీనికోసం 8106843571/8247049853 లకు ఫోన్ చేయవల్సిందిగా కోరారు.

పొడదుప్పిపై కుక్కల దాడి



గాయపడిన పొడదుప్పిని పరిశీలిస్తున్న అటవీ అధికారులు

సిద్దవటం : అటవీ ప్రాంతం నుంచి ఓ పొడదుప్పి శుక్రవారం ఉదయం సిద్దవటం మండలంలోని నేకనాపురం శివారుకు నీటి కోసం వచ్చింది. కుక్కలు దాడి చేస్తుండగా స్థానికులు కాపాడారు. కడప రేంజర్ ప్రసాద్‌కు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమై అటవీ సిబ్బంది నేకనాపురం చేరుకుని పొడదుప్పిని పరిశీలించారు. ప్రథమ చికిత్స కోసం భాకరాపేట పశు వైద్యశాలకు తరలించారు. రేంజర్ ప్రసాద్ మాట్లాడుతూ తాగునీటి కోసం వస్తున్న వణ్యప్రాణులకు ఎటువంటి హాని చేయకూడదని చెప్పారు. సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.

సిద్దవటంలో చోరీ



దొంగతనం జరిగిన మహబూబ్ భాషా షాపు

సిద్దవటం : సిద్దవటం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న షేక్ మహబూబ్‌భాషా గాలి మిషన్, కూల్‌డ్రింక్ షాపులో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుని కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దుండగులు షాపు తాళాలను పగుల గొట్టి రూ.70 వేల విలువ చేసే సిగరెట్ ప్యాకెట్లు, రూ. 30 వేల విలువ చేసే టూవీలర్ అపోలో కంపెనీ టైర్లు, రూ.20వేల నగదుత పాటు షాపులోని పుటేజీల డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారన్నారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌లో బాధితుడు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్ఐ పెద్ద ఓబన్న వివరణ కోరగా దొంగతనం జరిగిందన్న సమాచారం తెలియడంతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామన్నారు.

వ్యక్తి అదృశ్యం

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బాలాజీపేటలో నివాసం వుంటున్న సునీల్ రాబిన్ (30) ఈ నెల 22న ఇంటి నుంచి పెయింట్ పనికోసం వెళ్లాడు. 27న మరలాతన భార్య లతకు ఫోన్ చేసి త్వరగానే ఇంటికి వస్తానని తెలియజేశాడు. తరువాత ఫోన్ స్విఛాప్ రావడం, మరలా ఇంటికి రాకపోవడంతో సునీల్ రాబిన్ భార్య లత శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక

కలకడ : మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీకి చెందిన టీడీపీ నాయకులు పి.వెంకట్రమణ, నాగేంద్ర, సంతోష్, రాజశేఖర్, మదన్ మోహన్, సాధిక్, సమీవుల్లా, వీరకుమార్, తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారికి పార్టీ కండువాలుకప్పి సాదరంగా స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై, మేనిఫెస్టోపై నమ్మకంతో చేరుతున్నట్లు తెలిపారు. ఎంపీపీ శ్రీదేవి రవికుమార్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లె : మండలంలోని ఆర్‌ఎన్.తాండా బోనాసువారిపల్లెకు చెందిన 20 కుటుంబాలు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కండువా కప్పి వారిని పార్టీలోకి స్వాగతించారు. జగనన్న హయాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల లబ్ధిని చూసి పార్టీలోకి రావడం జరిగిందన్నారు.



పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న బాలయ్యగారి పల్లె వాసులు



వైఎస్సార్‌సీపీలో చేరిన బోనాసువారిపల్లి వాసులతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

దిగువపల్లెలో 30 కుటుంబాలు

ఓబులవారిపల్లె : చిన్నఓరంపాడు దిగువపల్లె, బెస్తపల్లి గ్రామానికి చెందిన గాలి శంకరయ్య, జి.నరేంద్ర, జి.పెంచలయ్య, జి.రెడ్డి బాలాజీ, జి.శివకుమార్, ఎం.మోహిత్, జి.విజయ్ కుమార్, నారం రెడ్డి రాజశేఖర్ రెడ్డి మొత్తం 30 కుటుంబాలవాసులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ముక్కా రమేష్ కుమార్ రెడ్డి, ముక్కా సరస్వతి, పిచ్చన్న, రెడ్డయ్య, దుర్గా ప్రసాద్, ముక్కా వెంకటసుబ్బారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బిఆర్.ప్రేమ్, వంకన దుర్గారెడ్డి, సి.సుదర్శన్ రెడ్డి, గంగిరెడ్డి, కొప్పుల శేఖర్, చింత దుర్గారెడ్డి, షేక్ మౌలానా, అడవి రమణ, ఏ నాగార్జున, గాడి నాగేంద్ర, ముక్కా చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో టీడీపీ నుంచి వలసలు

ములకలచెరువు : ములకలచెరువు మండల కేంద్రానికి చెందిన రెడ్డి బాషా, సుబహాన్, పెద్దరెడ్డి పీరుసాబ్, చిన్న రెడ్డి పీరూసాబ్, షాకీర్, వశీసాబ్ తదితర 20 రాళ్లపల్లె కుటుంబీకులు, డాబా రమేష్ యాదవ్‌లు శుక్రవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ములకలచెరువులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరడంతో వైఎస్సార్‌సీపీలో చేరినట్లు తెలిపారు.

గొల్లపల్లెలో టీడీపీ నాయకులు

రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయితీలోని గొల్లపల్లెకు చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. రాయచోటి శాసనసభ్యులు గడికోట శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం పార్టీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



దిగువపల్లె, బెస్తపల్లి వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ములకల చెరువు వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీ పార్టీ కండువాను కప్పి గొల్లపల్లె వాసులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

జాతీయ రహదారిపై ప్రమాదం

క్షతగాత్రులను అంబులెన్స్‌లో పంపిన రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండలం కడప–రేణిగుంట రహదారిపై చెర్లోపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఆళ్లగడ్డ మండలం గాంధీ నగర్‌కు చెందిన బసవరావు కుటుంబ సభ్యులు తొమ్మిది మంది స్కార్పియోలో వెళ్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. బసవరావు, ఆయన భార్య నాగలక్ష్మీ, కుమారుడు చైతన్య రావు, వైష్ణవి, నలుగురు చిన్న పిల్లలు ఈ ప్రమాదంలో గాయపడ్డారు. ప్రచారం ముగించుకొని వస్తున్న రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి ఇది చూసి మానవతా దృక్పదంతో స్కార్పియోలో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసుకువచ్చి అంబులెన్స్‌లో ఆస్పత్రికి పంపారు.



స్కార్పియోలో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీస్తున్న దృశ్యం

ఆయన వెంటఉన్న రాష్ట్ర వైఎస్సార్ సీపీ మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వర్ రెడ్డి, వారి మిత్రబృందం గాయపడిన వారికి ధైర్యం చెప్పి 108 వాహనంలో ఎక్కించి పంపారు. ఎస్ఐ మధుసూదన్ రావు కేసు నమోదు చేసి వారిని రిమ్స్‌కు తరలించారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. పట్టణంలోని బుగ్గ కాలువ సమీపంలో వృద్ధురాలైన నిర్మలమ్మ (60) బిక్షాటన చేస్తూ జీవిస్తోంది. గురువారం మధ్యాహ్నం సొమ్మసిల్లి తాను ఉంటున్న చోటనే పడిపోయింది. ఆమె మృతి చెందినట్లు భావించి స్థానికులు వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆమెకు సంబంధించిన బంధువులు ఎవరైనా ఉంటే వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. అదేవిధంగా పట్టణంలోని రామ్‌నగర్ లో నివసిస్తున్న భద్రయ్య చారి (74) కదిరి రోడ్డులో కొలిమి పని చేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని ప్రదేశానికి వెళ్తూ మార్గమధ్యంలోని మెట్రో కాంప్లెక్స్ వద్ద కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు వెంటనే బాధితుని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. ఇది వాట్సాప్ గ్రూపులలో వైరల్ చేయగా గుర్తించిన కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి చేరుకుని మృతదేహాన్ని తీసుకెళ్లారు.



బుగ్గ కాలువ వద్ద మృతి చెందిన వృద్ధురాలు నిర్మలమ్మ



మృతి చెందిన భద్రయ్య

ఆర్థిక ఇబ్బందులతో సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య

షేర్ మార్కెట్‌లో పెట్టుబడులతో నష్టాలు

మదనపల్లె : షేర్ మార్కెట్లో పెట్టుబడులతో నష్టాలు, ఆర్థిక ఇబ్బందులతో మానసికంగా కుంగిపోయిన సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మదనపల్లి మండలంలో జరిగింది.వేంపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, హేమావతి దంపతులకు బైగారి రాజేష్, బైగారి సతీష్, సుమలత ముగ్గురు సంతానం. వారిలో బైగారి సతీష్ (49) యూఎస్‌లో చదువుకొని సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డాడు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులోని గౌడన్నపాళ్య ప్రాంతంలో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తూ జీవిస్తున్నాడు. 20 సంవత్సరాల క్రితం శ్రీలక్ష్మితో వివాహం కాగా, కర్ణాటక కోర్టులో విడాకులు తీసుకున్నారు. అప్పటి నుంచి సతీష్ ఉద్యోగం చేస్తూ ఒంటరిగా జీవిస్తున్నారు. ఈ క్రమంలో తన సంపాదనను షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా ఉంచాడు. భారీగా నష్టాలు వచ్చి ఓవైపు ఆర్థిక ఇబ్బందులు, మరోవైపు ఒంటరితనం భరించలేక మద్యానికి బానిస అయ్యాడు. ఇటీవల ఒత్తిడి అధికం కావడంతో, తల్లి హేమలతను వద్ద రూ.3 లక్షలు తీసుకున్నాడు. మరో లక్ష రూపాయలు తండ్రి చంద్రశేఖర్‌ని అడిగాడు. ఈ నెల 1వ తేదీ రాత్రి బెంగళూరు నుంచి ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం తండ్రి పొలం వద్దకు వెళ్లగా, తల్లి డ్వాక్రా నగదు చెల్లించేందుకు వెళ్లారు. ఆ సమయంలో సతీష్ తీవ్ర మనస్థాపం చెంది ఇంటి రేకుల షెడ్డులోని గదిలోకి వెళ్లి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన తల్లి గమనించి కేకలు వేయగా చుట్టుపక్కల వారు వచ్చి సతీష్ కిందకి దించి, తాలూకా పోలీసులకు సమాచారం అందించారు.హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు, సీఐ ఎస్. శేఖర్ ఆదేశాలతో దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సతీష్

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉద్యోగులు



కిషోర్‌కుమార్‌రెడ్డి తోపాటు ఎన్నికల ప్రచారంలో ఉన్న ప్రభుత్వ చౌకదుకాణం డీలర్ మంజులమ్మ



కిషోర్‌కుమార్‌రెడ్డి తోపాటు ఎన్నికల ప్రచారంలో ఉన్న బీపీఎం మల్లికార్జునరెడ్డి

పీలేరురూరల్ : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ హల్‌చల్ చేస్తున్నారు. మండలంలోని వేపులబైలు తపాలా శాఖలో బీపీఎంగా పని చేస్తున్న గాయంవారిపల్లెకు చెందిన ఆరమడక మల్లికార్జునరెడ్డి గత కొన్ని రోజులుగా టీడీపీ అభ్యర్థి నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తోపాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే మండలంలోని అగ్రహారం పంచాయతీ కంభంమిట్టపల్లెకు చెందిన చౌకదుకాణం డీలరుగా ఉన్న వై.మంజులమ్మ టీడీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ కిషోర్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సివిల్ ఇంజినీరింగ్‌లో నైపుణ్యం అవసరం

హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్ఈ రాజగోపాల్

కురబలకోట : సివిల్ ఇంజినీరింగ్‌లో విద్యార్థులకు నైపుణ్యం అవసరమని హంద్రీనీవా ప్రాజెక్టు ఎస్ఈ సీఆర్ రాజగోపాల్ అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి సీటా–2క24 సాంకేతిక సింపోజియం ఘనంగా నిర్వహించారు. రాజగోపాల్ మాట్లాడుతూ ప్రతి సివిల్ ఇంజినీరుకు ప్రాజెక్టులో సర్వే, నాణ్యత, అంచనా, ప్రాజెక్టు ఎగ్జిక్యూషన్ వంటివి చాలా ఉపయోగపడతాయన్నారు నేడు నీటి వనరుల కోసం పోటీ పెరిగిందన్నారు. సక్రమమైన పద్దతుల ద్వారా నీటి నిల్వల కోసం ప్రాజెక్టులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విభిన్నంగా ఆలోచించేవారికి ప్రపంచంలో ఎక్కడైనా ఆదరణతో పాటు ఉపాధి, ఉద్యోగ రంగాల్లో రాణించగలరన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ రాజగోపాల్

హత్య కేసులో నిందితుల అరెస్ట్

కమలాపురం : కమలాపురం పట్టణంలోని పకీర్ వీధికి చెందిన సయ్యద్ మహ్మద్ బాషా (26) హత్య కేసులో 10 మంది ముద్దాయిలను డీఎస్పీ ఎండీ షరీఫ్ పర్యవేక్షణలో అరెస్ట్ చేసినట్లు సీఐ రామ క్రిష్ణారెడ్డి, ఎస్ఐ హృషికేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. కమలాపురం పట్టణం పకీర్ వీధికి చెందిన మహ్మద్ బాషా అలియాస్ ఘనికి, ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ ముబారక్‌ల మధ్య కొన్ని మనస్పర్థలు ఉండేవన్నారు. ఈ నేపథ్యంలో వారు పలుమార్లు ఘర్షణ పడ్డారన్నారు.ఇది మనసులో పెటుకున్న ముబారక్ గత నెల 30వ తేదీ రాత్రి 12.45ని. సమయంలో తన స్నేహితులైన నూర్ బాషా, హమీద్, యూనుస్, సాదక్, బాబాజీ, అభిలాష్, నూర్ మహ్మద్, రోహిత్,మహేష్‌లతో కలసి మహ్మద్ బాషాను హత్య చేయడానికి వల పన్నాడు. కత్తులు, కట్టెలు తీసుకుని మృతుని నివాసం వద్దకు చేరుకున్నారు. మృతుని తండ్రిని కట్టెలతో కొట్టి అడ్డు వచ్చిన కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేసి మహ్మద్ బాషాను కత్తులతో పొడిచి, కట్టెలతో కొట్టి హత్య చేశారన్నారు. డీఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రత్యేక టీంలుగా ఏర్పడి మండలంలోని పందిళ్లపల్లె 4 రోడ్ల కూడలి వద్ద 10 మంది ముద్దాయిలను చాకచక్యంగా పట్టుకుని అరెస్ట్ చేశామన్నారు. వారిని కోర్టుకు హాజరు పరిచి అనంతరం జైలుకు పంపించినట్లు సీఐ, ఎస్ఐ వివరించారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత కార్మికుడిపై కత్తితో దాడి

మదనపల్లె : చేనేత కార్మికుడిపై కత్తితో దాడిచేసిన సంఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె మాయాబజార్‌కు చెందిన వెంకటరమణ కుమారుడు సాంబశివ(39) స్థానికంగా చేనేత పనులు చేస్తూ జీవిస్తున్నాడు. రెండు రోజుల క్రితం తనతో పాటు పనిచేస్తున్న బుడాన్‌గిరిని వ్యక్తిగత కారణాలతో దూషించాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం బుడాన్‌గిరి బావమరిది సయ్యద్ ఆసిఫ్.. మా బావను తిడతావా అంటూ.. సాంబశివ పనిచేస్తున్న చోటకు వెళ్లి కత్తితో దాడికి పాల్పడ్డాడు. కడుపులో పొడవడంతో సాంబశివ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితుడిని బెంగళూరుకు తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

చిన్నపిల్లల వార్డులోకి పాము

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులోకి శుక్రవారం రాత్రి ఓ పాము వచ్చింది. దీంతో వార్డులోని రోగులు, సహాయకులు ఆందోళనకు గురయ్యారు. రాత్రి 7 గంటల సమయంలో చిన్నపిల్లల వార్డుకు పక్కనే ఉన్న చెట్లలో నుంచి విష సర్పం చిన్నపిల్లల వార్డులోని ప్రవేశ ద్వారం వద్దకు చేరింది. ఇది గమనించిన రోగులు వారి సహాయకులు కేకలు వేయడంతో, సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి చేరుకొని పామును పట్టి చంపేశారు. ఆసుపత్రి అధికారులు చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.



పాము ను చంపి బయటకు తీస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ప్రమాదంలో భర్త దుర్మరణం

– భార్యకు తీవ్రగాయాలు

కొండాపురం : ద్విచక్ర వాహనంలో తాడిపత్రి నుంచి స్వగ్రామం ఉమ్మారెడ్డిపల్లెకు వెళ్లుతుండగా ఇన్నోవా ఢీ కొట్టడంతో కుల్లి శివశంకర్(42) అక్కడిక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకొంది. ఈ ఘటనపై తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ వివరాల మేరకు.. ముద్దనూరు మండలం ఉమ్మారెడ్డి పల్లె గ్రామానికి చెందిన కుల్లి శివశంకర్, తన భార్య రంగమ్మ తాడిపత్రిలో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు కుమారుడు, కుమార్తె, సంతానం. కుమార్తె సర్టిఫికెట్లు తీసుకుని తాడిపత్రి నుంచి తన స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో జాతీయ రహదారి వెంకటాపురం సర్కిల్ వద్ద ఇన్నోవా ఢీ కొంది. కుల్లి శివశంకర్ అక్కడిక్కడే మృతి చెందాడు. భార్య రంగమ్మకు తీవ్రగాయాలవడంతో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు అక్కడి నుంచి అనంతపురానికి మేరుగైన వైద్యంకోసం తరలించారు. మృతి దేహాన్ని తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన శివశంకర్

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య



నాజియా (ఫైల్)

సంబేపల్లె : మండలంలోని దేవపట్ల అవుల వాండ్లపల్లెకు చెందిన షేక్ నాజియా అనే డిగ్రీ విద్యార్థిని (19) శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు ..ఆవులవాండ్లపల్లెకు చెందిన షేక్ మస్తాన్ ,హజీరా దంపతుల కుమార్తె ఎస్.నాజియా రాయచోటిలోని ఓ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ క్రమంలో ఇంటిలో ఎవరూ లేని సమయంలో నివాసంలోని రూముపై కొక్కీకి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు వారు తెలిపారు. ఎస్ఐ రామక్రిష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ కింద పడి మృతి



మృతి చెందిన చింతకుంట వెంకటసుబ్బయ్య

ఎర్రగుంట్ల : మండలంలోని పోట్లదుర్తి గ్రామానికి చెందిన చింతకుంట వెంకట సుబ్బయ్య (58) ట్రాక్టర్ కింద పడి మృతి చెందారని యర్రగుంట్ల ఎస్ఐ చిరంజీవి శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పోట్లదుర్తి గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్య నాపరాయి గనిని లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇతడి భార్య కొన్నేళ్ల కిందటే చనిపోయింది. ఇతడికి ముగ్గురు సంతానం. నాపరాయి గనిని లీజుకు తీసుకోని జీవనం గడుపుతున్నాడు. అప్పుల బాధ తాళలేక ట్రాక్టర్ టైర్ల కింద తల పెట్టి మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ చిరంజీవి పరిశీలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

వీరపునాయునిపల్లె : త్వరలో జరగబోవు సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసుల సంకల్పమని జిల్లా అడిషనల్ ఎస్పీ లోసారి సుధాకర్ అన్నారు.మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన పాయసంపల్లె, అలిదెన, కీర్తిపల్లె, రుటూరు గ్రామాల్లో ఎ.ఆర్ బలగాలతో శుక్రవారం ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొనేలా చర్యలు తీసుకోవడమే పోలీసుల ధ్యేయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై వెంకటరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్ల హక్కులపై అవగాహన



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : సీనియర్ సిటిజన్లు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ అన్నారు. ఆజాద్ నగర్‌లోని బృందా ఓల్డ్ ఏజ్ హోమ్‌ను శుక్రవారం జడ్జి సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను పలకరించి వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంరక్షణ, భద్రత కల్పించాల్సిన కుమారులు వృద్ధులను విడిచిపెట్టినా, పరిత్యాగం చేసే విధంగా బుద్ధిపూర్వకంగా వ్యవహరించినా శిక్షార్హులన్నారు. గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ నేషనల్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ 15100, సీనియర్ సిటిజన్స్ టోల్ ఫ్రీ నెంబర్:14567గా గుర్తించుకోవాలని, ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థ దృష్టికి తీసుకు రావచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బృంద ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు బాలసుబ్బయ్య, ఎన్జీవోలు మరియు సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.